

అధికారులకు సూచనలిస్తున్న డాక్టర్ బాలకిష్టారెడ్డి, పక్కన విజయ్‌కుమార్‌రెడ్డి

జేఎన్‌టీయూలో ప్రతీ సోమవారం 'క్లీన్ అండ్ గ్రీన్'

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలకిష్టారెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యూనివర్సిటీ క్యాంపస్ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కీలకనిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతీ సోమవారం పరిశుభ్రత వారంగా పాటించాలని అధికారులకు సూచించారు. ఇందులో పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను, విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులను కూడా భాగస్వాములను చేయాలని, ఈ మేరకు అన్ని విభాగాలకు సర్క్యులర్ జారీచేయాలని రిజిస్ట్రార్‌కు సూచించారు. కాగా, శనివారం ఉదయం 8గంటలకు వర్సిటీ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో కలిసి వీసీ బాలకిష్టారెడ్డి క్యాంపస్ ఏరియాను పరిశీలించారు. ప్రధాన ద్వారం నుంచి పరిపాలన భవనం వరకు క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



పీజేఆర్‌కు నివాళులర్పిస్తున్న తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి తదితరులు

నిజమైన కార్మికనేత పీజేఆర్

చిక్కడపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజమైన కార్మికనేత పీజేఆర్ అని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ప్రధానకార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అన్నారు. మాజీ మంత్రి, కార్మికనేత పి.జనార్దన్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని చిక్కడపల్లి లైబ్రరీవద్దనున్న రాహుల్‌గాంధీ చౌక్‌వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీజేఆర్ చిత్రపటంవద్ద నివాళులర్పించిన ప్రఫుల్ రాంరెడ్డి అనంతరం మాట్లాడారు. పీజేఆర్ జీవించినంతకాలం పేదప్రజలు, కార్మికుల పక్షానే నిలిచారన్నారు. సీఎల్‌పీ నేతగా కూడా పనిచేసిన ఆయన వీఎస్టీ కంపెనీలో చారిత్రాత్మక వేతన ఒప్పందాలు చేసిన ఘనత కూడా ఆయన సొంతం అన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, గడ్డం రాజేష్, ఎల్లూరి భాస్కర్‌రెడ్డి, హరికృష్ణ, సాయినాథ్, గండయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దివ్యాంగుల ఆటపాటలు

చిక్కడపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహంలో నివసిస్తున్న దివ్యాంగ బాలబాలికలు నిర్వహించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. నవ భారత్ లయన్స్‌క్లబ్, ప్రముఖ మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ, సైకాలజిస్టుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ ఆధ్వర్యంలో 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లోని విజయభారతి వేదికపై దేశభక్తిగీతాల ఆలాపన, శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనను దివ్యాంగ బాలబాలికలు నిర్వహించారు. చక్కగా ప్రదర్శనలు నిర్వహించిన దివ్యాంగ బాలబాలికలను అశోక్‌నగర్‌లోని డా. హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీకేర్ హాల్‌లో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మోహన్‌దాస్, డా. జి మహేంద్రకుమార్‌రెడ్డి, చొక్కాపు వెంకటరమణ, డా.రమేష్‌కుమార్, జి. కృష్ణవేణి, శాంతారావు, డా. హిప్నో పద్మాకమలాకర్ తదితరులు బహుమతులు, పుస్తకాలు, కేకులు బహూకరించి అభినందించారు.



పురస్కారాన్ని బహూకరిస్తున్న వేణుగోపాలచారి, రామరాజు తదితరులు

ఆంధ్రుల అభిమాన నటి సావిత్రి

చిక్కడపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అభిమాన నటి సావిత్రి అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో మహానటి సావిత్రి జయంతి సందర్భంగా అభినేత్రి సావిత్రికి సంగీత నృత్యహారతి కార్యక్రమంతో పాటు మహానటి సినిమాలో నటించిన బిందు చంద్రమౌళికి సావిత్రి ఆత్మీయ పురస్కార ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాలచారి పురస్కారం బహూకరించి మాట్లాడుతూ సావిత్రి నటన ఆనాటికి, ఈనాటికి ఏనాటికి అయినా కూడా తెలుగుప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు, నిర్వాహకులు సురేందర్, పుష్పలత, రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, వీరభోగ వసంతరాయలు, చింది బద్రినాథ్, వసుమతి, శివజ్యోతి, రమాదేవి, మూర్తి గురుస్వామి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావు తదితరులు

విద్యార్థులు ఆర్థిక శాస్త్రంపై పరిశోధనలు చేయాలి

రాంనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలు, ప్రగతి సాధన, వనరుల సద్వినియోగం అంశంపై విద్యార్థులు నిరంతర అధ్యయనం, అకుంఠిత దీక్ష కలిగి ఉండాలని పంజాబ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావు సూచించారు. డిమాండ్, సప్లై సంబంధాలు మధ్య ఆర్థిక శాస్త్రంపై విస్తృత పరిశోధన చేయాలన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ అంబేద్కర్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో మైక్రో ఎకనామిక్స్ చాలెంజెస్ ఇన్ ఎమర్జింగ్ ఎకనామిక్స్ అనే అంశంపై గెస్ట్ లెక్చరర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటీ సమాజంలో ఎకనామిక్స్ అనేది ప్రతి ఒక్కరూ తెలుసుకుని లావాదేవీలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

చిక్కడపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తను నివసించే గదిలోనే ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రీసాలగడ్డ ప్రాంతంలోని సయ్యద్ ఎజాజ్ ఇంటి మొదటి అంతస్తులో ఓ గదిలో మస్తాన్(45) అనే వ్యక్తి ఎనిమిది సంవత్సరాలుగా నివసిస్తున్నారు. కాగా ఆయన సమీపంలోని టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తారు. కాగా శుక్రవారం సాయంత్రం అదే భవనంలో నివసించే జైనబున్నీసా అనే మహిళ మొదటి అంతస్తులో బట్టలు ఆరవేయడానికి రాగా దుర్వాసన వచ్చింది. దీంతో మస్తాన్ నివసించే రూమ్ తలుపులు పును తోసి చూడగా గదిలోమస్తాన్ అపస్మారకస్థితిలో కనిపించారు. ఇంటి ఓనర్‌కు ఫోన్ చేసి పిలిపించగా ఆయన వచ్చి చూడగా అప్పటికే మస్తాన్ మరణించినట్లు గ్రహించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మౌనిక పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంతోష్‌కుమార్

బిహార్ వాసి అదృశ్యం

బర్కత్‌పుర, డిసెంబర్ 28(ఆంధ్రజ్యోతి): టూత్ బ్రష్ తెచ్చుకోవడానికి హోటల్ నుంచి బయటికి వెళ్లిన బిహార్ వాసి అదృశ్యమయ్యాడు ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌లోని చాప్రాకు చెందిన రఘునాథ్ కుమారుడు సంతోష్‌కుమార్ పావు(42) కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలలోని టూరిజం ప్రాంతాలను సందర్శించడానికి వచ్చారు. శనివారం ఉదయం ఏడు గంటలకు సంతోష్‌కుమార్.. టూత్ బ్రష్ తెచ్చుకోవడానికి హోటల్ నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో.. కుటుంబసభ్యులు హోటల్ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అతని సెల్‌ఫోను స్విచ్‌ఆఫ్ చేసి ఉంది దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

వృత్తి టైలర్ .. ప్రవృత్తి యాక్టర్

నటనలో రాణిస్తున్న జంగయ్యగౌడ్

చిక్కడపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నటనంటే ప్రాణం.. ఒక వైపు నటిస్తూనే మరోవైపు కుటుంబం కోసం టైలరింగ్ చేస్తున్నాడు సీనియర్ రంగస్థల నటుడు దొంతి జంగయ్యగౌడ్. దేవాలయ ఉత్సవాల ఊరేగింపు, బర్త్‌డే, వివాహ వేడుకల్లో తన నటనతో అందరినీ ఆకట్టుకుంటాడు.



సాయిబాబా వేషధారణలో..



జమునతో సత్కారం



హనుమంతుడిగా

చిక్కడపల్లికి చెందిన జంగయ్యగౌడ్ 50 ఏళ్లుగా డీజే టైలర్‌షాప్ నిర్వహిస్తున్నాడు. చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో నాటక రంగం వైపు అడుగులు వేశాడు. కానీ కుటుంబ పోషణ కోసం టైలరింగ్ చేసేవారు. 45 ఏళ్లుగా వివిధ పౌరాణిక, ఇతర నాటకాల్లో నటిస్తూనే ఉన్నారు. శ్రీకృష్ణరాయబారం, చింతామణి, సత్యహరిశ్చంద్ర, వెంకటేశ్వరస్వామి మహాత్మ్యం తదితర నాటకాలతో పాటు సాంఘిక నాటకాల్లో కూడా తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఇప్పటి వరకు పద్యనాటకాల్లో శ్రీకృష్ణుడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, సత్యకీర్తి, కర్ణుడు, సత్యహరిశ్చంద్రుడు, అశ్వత్థామ, ద్రోణాచార్యుడు తదితర పాత్రల్లో మెప్పించారు. దాదాపు 30 సాంఘిక నాటకాల్లో వివిధ పాత్రలు పోషించారు. ఆయన నటనను తిలకించిన బాగ్‌లింగంపల్లి షిర్డీసాయిబాబా ఆలయం పూజారి ఒకరు జంగయ్యగౌడ్‌ను పిలిపించి గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబా వేషధారణలో స్వామివారి పల్లకీసేవలో పాల్గొనాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆయన కాదనకుండా గురుపూర్ణిమ రోజు పల్లకీసేవలో సాయిబాబా వేషధారణలో ముందు సాగుతుండగా భక్తులు హారతులిచ్చినట్లు తెలిపారు. ఇలా తన నటనాజీవితంలో మరపురాని ఘటనలని వివరించారు. టైలర్‌షాపులో పని సరిగ్గా లేకపోవడంతో భుక్తికోసం పదిహేను సంవత్సరాలుగా నామమాత్రపు రుసుం తీసుకుని పాత్రలు వేస్తున్నట్లు జంగయ్యగౌడ్ వివరించారు.

కాంతారావు, అక్కినేని నాగేశ్వరరావు, జమున, గుమ్మడి వంటి వారి చేతులమీదుగా పలు పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు, జీవనసాఫల్య పురస్కారాలు, అవార్డులు అందుకున్న జంగయ్యకు తెలుగు విశ్వవిద్యాలయం వారు కీర్తి పురస్కారాన్ని ఇటీవల యూనివర్శిటీ వీసీ ఆచార్య కిషన్‌రావు చేతులమీదుగా అందజేసి అభినందించారు. ఏవీ కోటేశ్వరరావు, దార్ల అప్పారావు, పృథ్వి వెంకటేశ్వరరావు తదితరుల శిష్యరికంలో నటన నేర్చుకుని రాణిస్తూ ఏడు పదుల వయస్సులో నటనకే తన జీవితాన్ని అంకితం చేస్తానంటున్న జంగయ్యగౌడ్ నటన వర్ధమాన నటీనటులకు ఆదర్శనీయంగా పేర్కొనవచ్చు.



భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శని త్రయోదశి హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శని త్రయోదశి

నల్లకుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శని త్రయోదశి సందర్భంగా తిలతైలాభిషేకాలు, తిలాహోమం శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆలయంలో జరిగిన హోమంలో ఆలయ ప్రధాన అర్చకులు కూచి రాజేశ్వరశర్మ, సహాయకులు దేవులపల్లి బాలచంద్రశర్మ, పాలడుగు చంద్రశేఖరశర్మ పౌరోహితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ సాగింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, దేశ్‌ముఖ్ రమాకుమార్ పాల్గొన్నారు.

నా పేరుతో వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తనపేరు చెప్పి అక్రమ వసూళ్లు చేసేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, తనపై అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హెచ్చరించారు. శనివారం రాత్రి గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ వద్దకు వచ్చినవారందరికి సాయం చేస్తామని ఆయన వివరించారు. ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు వసూళ్లకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో కొందరు గిట్టనివారు అసత్య ప్రచారం చేస్తున్నారని దీన్ని తాను ఖండిస్తున్నానన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నామని తెలిపారు. దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన పేరు చెప్పి వసూళ్లకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసినవారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన పెరగాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలు, కాంట్రాక్టర్లలో అవగాహన పెరగాలని తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి పేర్కొన్నారు. నాసిరకం విద్యుత్ పరికరాలు, తీగలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని పలు ఎలక్ట్రికల్ వస్తువుల తయారీ కంపెనీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర వస్తువుల తయారీ, నాణ్యతను ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసీ రెడ్డి, సభ్యులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్‌లో పెద్దఎత్తున భారీ భవనాలు నిర్మాణమవుతున్న క్రమంలో ఆయా భవనాల్లో వినియోగించే విద్యుత్ తీగల నాణ్యత, ట్రాన్స్‌ఫార్మర్లు, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. రెండేళ్లుగా జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో 60 శాతం నిర్లక్ష్యం కారణంగా జరిగితే, 40 శాతం ప్రమాదాలు విద్యుత్ తీగలు, పరికరాల నాణ్యత లోపాలతో జరిగినట్లు ప్రాథమికంగా తేలిందన్నారు. బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉపకరణాలనే వినియోగించాలని ఆయన సూచించారు. లైసెన్స్ పొందిన కాంట్రాక్టర్లు, ఎలక్ట్రీషియన్లతో మాత్రమే విద్యుత్ మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుబాబు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరింగ్‌ను పరిశీలిస్తున్న యాదగిరి, ప్రైవేట్ కాంట్రాక్టర్లు

● నియామకం



బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ప్రేమ్‌నగర్ బూత్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన సాయికిరణ్, సతీష్‌లకు నియామక పత్రం అందజేశారు. కన్నె రమేష్‌యాదవ్, జి.ఆనంద్ గౌడ్, మైలారం రాజు, యశ్వంత్ తదితరులు - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

● ప్యాచ్‌వర్క్



అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ శనివారం డివిజన్‌లోని బాపూనగర్‌లో జరుగుతున్న ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

● మహాపడిపూజ



కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డలో శనివారం నిర్వహించిన శ్రీఅయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్; నాయకులు సుభాష్‌పటేల్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయరత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ - 2025 ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి (సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సంస్థ) స్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఇఎస్.ఎస్.నారాయణ మాష్టారు తెలిపారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారుల ప్రతిభ, సేవలను గుర్తించి వారికి ఈ పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జనవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అవసరాల కోసం ఆల్ ది బెస్ట్ అకాడమి, డోర్ నెంబర్ 1-20-164, తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్, 16 చిరునామాకు పంపించాలని లేదా 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

అంబర్‌పేటలో స్వల్పంగా పెరిగిన నేరాలు

అంబర్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గత సంవత్సరం కంటే ఈ ఏడు నేరాలు స్వల్పంగా పెరిగాయి. గత సంవత్సరం పీఎస్‌లో 686 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 770 కేసులు నమోదయ్యాయి. వీటిలో హత్యలు 2, మిస్సింగ్ 128, ఆత్మహత్యలు 48, ఉదయం వేళ దొంగతనాలు ఒకటి, రాత్రి దొంగతనాలు మూడు, సాధారణ దొంగతనాలు 75, చైన్ స్నాచింగ్‌లు 3, పోక్సో కేసులు 14, చీటింగ్ కేసులు 81, సాధారణ ప్రమాదాలు 71, ప్రమాదాలలో మరణించిన కేసులు 6, డక్కాయిట్ కేసులు 2, కిడ్నాప్ కేసులు 23 నమోదయ్యాయి.

నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నాం: సీఐ

అంబర్‌పేట పీఎస్‌లో నేరాలను నియంత్రించడానికి ఉన్నతాధికారుల సహకారంతో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ డి.అశోక్ తెలిపారు. పీఎస్ పరిధిలోని మూడు సెక్టార్‌లలో పోలీసు గస్తీని పెంచినట్లు పేర్కొన్నారు. పీఎస్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు స్పందిస్తున్నట్లు తెలిపారు. పీఎస్‌కు వచ్చే మహిళ కేసులను ఉమెన్ పీఎస్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. రాత్రి వేళల్లో పోలీసులు అన్ని ప్రాంతాలలో ప్రత్యేక నిఘా పెట్టి నేరాలను అదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గ్రేటర్‌లో సభ్యత్వ నమోదును పూర్తి చేయాలి

టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్

నల్లకుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గాలలో 20 వేలకు పైగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలనే ఏకైక లక్ష్యంతో పార్టీశ్రేణులు పనిచేయాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ సూచించారు. ఇప్పటికే నగరంలో 5 లక్షలకు పైగా పార్టీ సభ్యత్వం పూర్తయిందన్నారు. టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అక్టోబర్ 26వ తేదీన ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జనవరి 31వ తేదీ లోపు గడువును పెంచినట్లు గుర్తు చేశారు. దీంతో పార్టీశ్రేణులు సభ్యత్వ నమోదు కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు. శనివారం ఉదయం నల్లకుంటలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లకుంట డివిజన్‌లో 5 వేల పార్టీ సభ్యత్వం పూర్తి చేశారని మిగత టార్గెట్ సభ్యత్వంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు 85 లక్షలకు పైగా పార్టీ సభ్యత్వం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎడ్ల సత్యనారాయణ, ఇ.భానుప్రకాష్, కె.పరుశురాం, చారి, వెంకటేష్ చౌదరి, నరసింహగౌడ్, జి.గురుమూర్తి, కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశరథ్, నాయకులు భానుప్రకాష్ తదితరులు

కానిస్టేబుల్‌పై దాడి

- పోలీస్ తలకు గాయం
- నిందితుల అరెస్ట్

చిక్కడపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డయల్ 100 నుంచి కాల్ రావడంతో అప్రమత్తమైన చిక్కడపల్లి పోలీసులు ఇద్దరు కానిస్టేబుళ్లకు సంఘటనా స్థలానికి పంపారు. అక్కడ భార్యాభర్త, కుటుంబసభ్యుల మధ్య జరుగుతున్న గొడవను ఆపడానికి కానిస్టేబుళ్ల ప్రయత్నించారు. ఈ సందర్భంలో కానిస్టేబుల్‌పై ఇద్దరు వ్యక్తులు బండరాయితో దాడి చేశారు. ఈ దాడిలో కానిస్టేబుల్ తలకు గాయమైంది. నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిసింది. ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కడపల్లి పీ అండ్ టీ కాలనీలోని ఓ క్వార్టర్స్‌లో నర్సింహ అనే యువకుడు నివసిస్తున్నారు. ఆయన తండ్రి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి కావడంతో క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల నర్సింహకు బాలాపూర్‌కు చెందిన స్రవంతితో వివాహం జరిగింది. వివాహం జరిగిన రెండు రోజులకే స్రవంతి భర్తను వదిలిపెట్టి వెళ్లిపోయింది. కాగా భార్యాభర్తలను కలిపే విషయంలో ఇద్దరికి మీర్‌పేట్ పీఎస్‌లో కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి స్రవంతి సోదరుడు సంతోష్(23), మరో వ్యక్తి సందీప్(22) మరికొందరు నర్సింహ వద్దకు వచ్చి గొడవకు దిగారు. కాగా నర్సింహ తనపై దాడి జరుగుతుందని 100కు డయల్ చేశారు. కాల్ అందుకున్న చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శివకుమార్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే సంతోష్, సందీప్‌లు కానిస్టేబుల్ శివకుమార్‌పై బండరాయితో దాడి చేశారు. దీంతో శివకుమార్ తలకు గాయమైంది. వెంటనే ఆయనను మరో కానిస్టేబుల్ సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సంతోష్‌పై ఇదివరకే 11 కేసులు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు.

వీఎస్టీ యూనియన్ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి విజయం

రాంనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుగా మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడుగా జి.సంజీవరెడ్డి 57 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శనివారం జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం ఐఎన్‌టీయూసీ తరఫున పోటీ చేసిన జి.సంజీవరెడ్డికి 172 ఓట్లు, నాయిని నర్సింహారెడ్డి గ్రూప్ తరఫున పోటీ చేసిన వి.శ్రీనివాస్‌రెడ్డికి 115 ఓట్లు, బీజేపీ తరఫున పోటీ చేసిన బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి 95 ఓట్లు వచ్చాయి. కంపెనీలో మొత్తం 386 మంది ఓటర్లు ఉండగా ఓటింగ్‌లో 382 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.సంజీవరెడ్డి నాయకులు కుడిది రాజు, ఎల్.డి.పాల్, ఎ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, సమద్, జానకిరామ్; కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంజీవరెడ్డికి ఓట్లు వేసి గెలిపించిన కృతజ్ఞతలు తెలిపారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు



రాంనగర్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం అరవింద్ కుమార్ యాదవ్, పట్నం నాగభూషణం గౌడ్

(జోన్ బృందం, ఆంధ్రజ్యోతి)

దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరించి ప్రగతి పథంలో నడిపిన గొప్ప ఆర్థికవేత్త దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ కొనియాడారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్‌లో దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ముషీరాబాద్ నియోజకవర్గం బీ-బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ హాజరై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

దేశం గర్వించదగ్గ ప్రధానులలో ఒకరు

దేశం గర్వించ తగ్గ ప్రధానులలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఒకరని, ఆయన మరణం దేశానికి తీరని లోటని తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. కవాడిగూడ న్యాయవాదుల జేఏసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాన్ని అభివృద్ధి చేయడంలో, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన కృషి మరువలేనిదని అన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు తీరనిలోటు

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి దేశ ఆర్థిక వ్యవస్థకు తీరనిలోటు అని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయకుమార్‌గౌడ్‌లు అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నాడు క్లిష్ట స్థితిలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ సమయంలో గాడిలో పెట్టేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా యూజీసీ చైర్మన్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా అనేక పదవులు పొంది సేవలందించిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్ అని సీనియర్‌కాంగ్రెస్ నాయకుడు కన్నా డేనియల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని గాంధీనగర్‌లో శనివారం మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కన్నాడేనియల్ మాట్లాడుతూ దేశ ఆర్థిక చరిత్రను కీలక మలుపు తిప్పిన మహోన్నతుడు మన్మోహన్‌సింగ్ అన్నారు. ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్న భారతదేశాన్ని తన మేధస్సుతో గట్టెక్కించిన మేధావి ఆయన అన్నారు. దేశాన్ని ప్రగతిపథం వైపు నడిపించిన మహానాయకుడు మన్మోహన్‌సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.